పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మృతిచెందిన కుటుంబ సభ్యుల ఫోటోలతో ధర్నా

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించా లని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబ సభ్యుల ఫోటోలతో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇంచార్జ్ కమిషనర్ శ్రీనివాస రాజు కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, యూనియన్ నాయకులు ఎస్.శంకర్రావు, సిహెచ్.సింహాచలం మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఆప్కాస్ విధానంలో మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జీవో నెంబర్ 25 ప్రకారం ప్రతిష్టంగా అమలు చేయాలని చట్టం ఉన్నప్పటికీ పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో అమలు కాకపోవడం అన్యాయమని మండిపడ్డారు. రాత్రిపూట డ్యూటీలు చేస్తున్న కార్మికులకు ఏ ఒక్క రక్షణ లేదని, వాహనాలు వలన, ఆకతాయిల వలన ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అలాగే యోగాంధ్రలో పనిచేసిన కార్మికులకు టిఏలు, డిఏలు ఇవ్వాలని, మున్సిపల్ వాహనములు నడుపుతున్న సీనియర్ వర్కర్లను డ్రైవర్లుగా గుర్తించాలని, మున్సిపల్ వర్కర్లపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవిస్తున్న పట్టించుకునే పరిస్థితి లేదని, ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సూరిబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.మల్లేష్, పి.గాంధీ, ఆర్.వెంకటరమణ, శీల వినయ్ కుమార్, కె.రాంబాబు, హెచ్ మహేంద్ర, జె.లక్ష్మి, బి.నాగమణి, బి.భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలోకి కార్పొరేట్ కంపెనీలు వద్దు

కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా

విశాలాంధ్ర-బెలగాం: మూడవసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశంలో రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ రైతుకు ద్రోహం చేస్తుందని పలు రైతు, రైతు కూలీ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు, కార్మిక నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. దేశంలో వ్యవసాయ రంగంలోకి 'కార్పొరేట్' సంస్థలను తీసుకు వచ్చే ఆలోచన, నిర్ణయం మానుకోవాలని, పంటలు పండే భూములు కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ఇవ్వొదని డిమాండ్ చేసారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బంటు దాసు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఈ.వి నాయుడు, రైతు కూలీ సంఘం ఏపీ నాయకులు పి. శ్రీనునాయుడు, కృష్ణ వేణి, ఎం.భాస్కరరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిన మోహన్ రావు, గేదెల రామకృష్ణ, వంగల దాలినాయుడు, ఏఐటియుసి నాయకులు ఆర్వీఎస్ కుమార్, సింహాద్రి దుర్గారావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలి

హర్ ఘర్ తిరంగ్ ర్యాలీలో మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని మంత్రి సంధ్యారాణి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ఎమ్మార్వో కార్యాలయం కూడలి నుండి స్టేట్‌బ్యాంక్ వరకు శోభయామానంగా సాగిన ర్యాలీలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పౌరుడులోనూ దేశభక్తిని పెంపొందించాలన్నారు. దేశం, సమాజం పట్ల ప్రతీ పౌరుడు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఎందరో మహానుభావుల త్యాగఫలమే నేడు మనం అందుకుంటున్న స్వతంత్ర ఫలమని అన్నారు. ప్రతిఒక్కరిలో జాతీయతా భావాన్ని పెంపొందించేందుకు వీలుగా ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వందేమాతరం, భారత్ మాతాకి జై అంటూ దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. స్పెషల్ ఆఫీసర్ రామచంద్రరావు, ఎంపిడిఓ గొల్లపల్లి పార్వతి, ఎమ్మార్వో నీలకంఠరావు, డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసి వైస్ చైర్మన్‌గా రౌతు వేణుగోపాలనాయుడు

విశాలాంధ్ర-సీతానగరం: పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా రౌతు వేణుగోపాలనాయుడును నామినేట్ చేసారు. ఆయనతోపాటు మండలంలోని సీతానగరంకు చెందిన సాల హరిగోపాలరావు, మరిపివలసకు చెందిన కొత్తాడ భవాని, తామరఖండికి చెందిన పెద్దిరెడ్ల హిమబిందులను నియామకం చేశారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆశీస్సులతో నియమించబడిన వారు త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనున్నారు. పార్వతీపురం వ్యవసాయ మార్కెట్లో మండలం నుండి నామినేట్ చేయబడిన నలుగురును మండల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

ఎంఈఓ1ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-పార్వతీపురం : ఎంఈఓ-1ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ కు వినతిపత్రం అందజేసినట్లు ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. బుధవారం కలెక్టర్ ను కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు. ప్రధానంగా రెండు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్‌ని కోరడం జరిగిందన్నారు. ఎంఈఓ-1లుగా పనిచేస్తున్న వారిలో అత్యధికంగా 2017 నుండి ఒకే ప్రదేశంలో 8 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్నప్పటికీ ఇంతవరకు బదిలీలు నిర్వహించక పోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని, కావున ఎంఈఓ 1లకు బదిలీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అదేవిధంగా మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, మండలంలో ఉన్న ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ డిడివోగా వ్యవహరిస్తున్న ఎంఈఓ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడంవల్ల చాలా ఇబ్బందిగా ఉందని తెలియజేశామన్నారు. ఈ రెండు ప్రధాన సమస్యలపై పలుమార్లు తమ అసోసియేషన్ పక్షాన ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఎంఈఓ 1 లందరూ తీవ్ర ఆవేదన చెందుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేసామన్నారు. తమ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్తామని హామీ ఇచ్చారని, ఇందుకుగాను కలెక్టర్‌కు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సామలన్నారు.

జీరో టిక్కెట్‌పై కండక్టర్లకు అవగాహన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కండక్టర్లకు జీరో టిక్కెట్‌పై అవగాహన కల్పించడం జరిగిందని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఈ.ఎస్.కె దుర్గ తెలిపారు. డిపో నందు 65 బస్సుల్లో స్త్రీ శక్తి పథకం కింద మహిళలు, బాలికలు ట్రాన్స్ జెండర్స్ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొంద వచ్చున్నారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ మరియు ఇంటర్ స్టేట్ సర్వీస్ లైనా జెకేపూర్ నారాయణపట్నం సర్వీసులకు ఈ పథకం వర్తించదన్నారు. ఈ పథకం ద్వారా రోజుకు సుమారు 10 నుండి 15000 మంది మహిళలు లబ్ధిపొందుతారని ఒక అంచనా. దీనికి సంబంధించి 65బస్సుల కండిషన్‌ని మెరుగుపరచడం జరిగిందన్నారు. ఈపథకం ప్రారంభానికి అన్ని విధాలుగా సంసిద్ధులమై ఉన్నామన్నారు. ఈ పథకముకు సంబంధించి లబ్ధి పొందగోరు లబ్దిదారులు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు, వాటర్ ఐడి వంటి గుర్తింపు కార్డులను ఏదో ఒకటి తమతోపాటు తీసుకొచ్చి కండక్టర్‌కి తనిఖీ సమయంలో అధికారులకి చూపించవలసి ఉంటుందన్నారు. స్థానికత ధ్రువీకరణ లేకపోయిన పక్షంలో ఈ పథకం వర్తించదు.

గర్భిణీల రికార్డులు సక్రమంగా ఉండాలి: జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోగల గర్భిణీలకు అందుతున్న వైద్య పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలు వారివారి రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ రఘుకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని బంధలుప్పి పిహెచ్సి పరిధిలోగల వెంకంపేట గ్రామంలో గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలు, జనని సెషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా గర్భిణీల రికార్డులు నమోదు ధ్రువీకరణ క్షుణ్ణంగా పరిశీ లించారు. ముఖ్యంగా పీఎం జేఏవై పీఎం ఎస్ఎండిసిడి రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలని అలాగే క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విధినిర్వహణపట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని రికార్డులో పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. ఈ పరిశీలనలో ఆయనతోపాటు వైద్యులు శ్రీకాంత్, ఏఎన్ఎంలు ఉన్నారు.

ఐటిడిఏలకు రెగ్యులర్ ప్రోజెక్టు అధికారుల్ని నియమించాలి

గిరిజన అభ్యుదయ సంఘం డిమాండ్

విశాలాంధ్ర-కురుపాం : పార్వతీపురం, పాలకొండ డివిజన్ల సబ్ కలెక్టర్‌లుగా బాధ్యతలు చేపట్టి ఐటీడీఏలకు అదనపు బాధ్యతలు స్వీకరించిన అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్ కుమార్ రెడ్డిలను సబ్ కలెక్టర్ లుగా బదిలీ అయిన నేపథ్యంలో వారిని పూర్తి స్థాయి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులుగా నియామకాలు చేపట్టాలని ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ కోరారు. బుధవారం కురుపాంలో ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ సబ్ కలెక్టర్ లుగా నియమించబడి ఐటిడిఏ పీవో లుగా అదనపు బాధ్యత స్వీకరించిన అనంతరం గిరిజన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాకుండా ఆ సమస్యలను పరిష్కారం నకు ఎంతగానో కృషి చేస్తున్నారని ఈలాంటి అధికారులు ఐటీడీఏలకు మరో ఏడాది కాలం ప్రాజెక్ట్ అధికారులుగా కొనసాగిస్తే గిరిజన అభివృద్ధి తథ్యమని కావున గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దృష్టి సారించి వారిని ఐటీడీఏ పీవోలుగా కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలి కోరుచున్నామన్నారు.

రైతు ఆనందమే... దేశానికి సుభిక్షం

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే

వ్యవసాయరంగం లాభసాటి కావాలి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : రైతు ఆనందంగా ఉన్నప్పుడే వ్యవసాయ రంగం లాభసాటి, దేశం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. రైతు బాగుంటేనే అందరం బాగుంటామని, అటువంటి రైతులను ఆదుకోవడం కోసం కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు జమ చేసింది. దీంతో రైతులతో కలిసి విజయోత్సవ ర్యాలీ మండలం నర్సిపురం గ్రామం నుంచి మార్కెట్ యార్డ్ వరకు బుధవారం ఆనందోత్సవ నడుమ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సాగింది. ముందుగా నర్సిపురం గ్రామంలో గల అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సెంట్లు ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయడం జరుగుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు ఏడాదికి 20,000 రూపాయలు అందిస్తామన్నారు. ఇందులో భాగంగా ఇటీవల ప్రతి రైతు ఖాతాలో 7000 రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల రైతులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. కౌలు రైతులకు సైతం ఈ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప చేస్తుందని, త్వరలోనే కౌలు రైతులకు కేవైసీ పూర్తిచేసి ప్రతి ఒక్కరికి 20వేల రూపాయలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతు బాగుంటేనే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. అన్నం పెట్టిన రైతు బాగుండాలని మనమంతా కోరుకుందాం అన్నారు. రైతు కష్టాలు తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతు కష్టాలు తీర్చడం జరుగుతుందన్నారు. ఈ ఆనందోత్సవ ర్యాలీలో 130 ట్రాక్టర్లతో రైతులు పాల్గొనడంతో పట్టణంలోని ప్రధాన రహదారి రైతులతో కూడిన ట్రాక్టర్లు, పసుపు జెండాలతో శోభాయ మానంగా మారింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్వతీపురం సీతానగరం, బలిజిపేట కూటమి మండల పార్టీ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఎస్సై జి.కళాధర్

విశాలాంధ్ర-వీరఘట్టం : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని ఎస్ఐజి కళాధర్ బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని, డ్రగ్స్ వాడటం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారని, ఎవరైనా డ్రగ్స్ విక్రయించిన లేదా డ్రగ్స్ వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడినని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16, 17న సీపీఐ జిల్లా మహాసభలు

విశాలాంధ్ర-కొయ్యూరు : ఈనెల 16, 17 తేదీల్లో భారత కమ్యూనిస్టు పార్టీ అల్లూరు జిల్లా మహాసభలు రంపచోడవరంలో నిర్వహించడం జరుగుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ అన్నారు. బుధవారం కృష్ణదేవిపేట అల్లూరి నందనవనంలో కొయ్యూరు మండల సిపిఐ పార్టీ కార్యవర్గ సమావేశం మండల పార్టీ కార్యదర్శి ఉల్లి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా మండలం నుండి అత్యధిక సంఖ్యలో మహాసభలకు జన సమీకరణ చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీకి కంచుకోట లాంటి అల్లూరి జిల్లాలో పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని దానిలో భాగంగానే జిల్లా మహాసభల్లో అనేక తీర్మానాలు ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలు విజయవంతం చేయడానికి మండలం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పార్టీ సానుభూతిపరులు అభిమానులు మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ అల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరవాడ దేముడు, రావణ పల్లి ఎంపీటీసీ ఇరవాడ సత్యవేణి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ధన్యం రాజు కనకరాజు, గిరిజన సమైక్య అల్లూరు జిల్లా అధ్యక్షుడు దరిశి సతీష్, మండల కార్యవర్గ సభ్యులు ఇరవాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : సిపిఐ పార్టీ జిల్లా మహాసభలు ఈనెల 16, 17న రంపచోడవరంలో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కె. సింహాచలం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. ఈనెలలో అల్లూరి జిల్లా రంపచోడవరంలో జరగనున్న మహాసభల్లో తదితర సమస్యలపై, పార్టీ బలోపేతం, వివిధ సమస్యలపై మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిపిఐ పార్టీ మహాసభలను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎటపాక : ఈనెల 16,17 తేదీన జరిగే సీపీఐ పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, సీపీఐ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము మాట్లాడుతూ సిపిఐ పార్టీ వందేళ్లుగా సమ సమాజ స్థాపన కోసం ప్రజల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు నిర్వహించిందని, కార్మికులు కర్షకుల పక్షాన పోరాడే పార్టీ అని గుర్తుచేశారు. ప్రత్యేకంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కాపాడుకోవడంలో గిరిజనుల భూహక్కుల సాధనలో పార్టీ చేసిన కృషి అమూల్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కంటే రాజు, సీపీఐ మండల కార్యదర్శి ఎలీషాల నాగరాజు, మాజీ ఎంపీటీసీ ముత్తయ్య, ఏడిద సుబ్బారావు, ములిశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతాంగానికి ఎరువులు పంపిణీ చేయాలి

సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు

విశాలాంధ్ర-కొయ్యూరు : మండల వ్యవసాయ రైతాంగానికి కూటమి ప్రభుత్వం తక్షణమే ఎరువులు పంపిణీ చేసి ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో సూరిబాబు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం రైతులు ఎరువులు కోసం పడుతున్న బాధలు మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. ఎరువులు పంపిణీ చేయకపోవడంతో అధిక రేట్లతో ప్రైవేటు మార్కెట్లో కొనలేక గిరిజన రైతాంగం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసిన పంటలకు సకాలంలో ఎరువులు వేస్తేనే రైతుకు తగినంత గిట్టుబాటు లభిస్తుందని కానీ ప్రభుత్వం మాత్రం ఎరువులు పంపిణీలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తాము ప్రకటించుకున్నట్లుగా గొప్ప ప్రభుత్వం అనిపించుకోవాలంటే వెనువెంటనే గిరిజన రైతాంగానికి ఎరువులు పంపిణీ చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

సంకాడ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-జీకే వీధి : సంకడా గ్రామ పంచాయితీలో స్థానిక సర్పంచ్ నాగులమ్మ అధ్యక్షతన, జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో నూతన పంచాయితీ కమిటీలు ఏర్పాటు చేశారు. సంకడా పంచాయితీ అధ్యక్షులుగా మామిడి రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ముర్ల బాలరాజు, రైతు విభాగం అధ్యక్షులుగా పోతురాజు కృష్ణ బాబు, ప్రధాన కార్యదర్శిగా దుచ్చరి పెంటన్న దొర, మహిళా విభాగం అధ్యక్షురాలుగా దేశగిరి నాగులమ్మ, ప్రధాన కార్యదర్శిగా మామిడి శిరీష లను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. అనంతరం బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల యూత్ అధ్యక్షులు కొర్ర బాబు, లమ్మసింగి రమేష్, వైసీపీ సీనియర్ నాయకులు కంకిపాటి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపల్లిలో వద్దు... చింతపల్లిలోనే ముద్దు

-కాఫీ శుద్ధి కర్మాగరాన్ని మైదాన ప్రాంతానికి తరలిస్తే చింతపల్లిని అష్టదిగ్బంధనం చేస్తాం

- ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నయ్య పడాల్, కాఫీ రైతు సంఘం నాయకుడు కుసలవుడు

విశాలాంధ్ర-చింతపల్లి : కాఫీ శుద్ధి కర్మగారాన్ని మైదాన ప్రాంతానికి చెందిన చెట్టుపల్లిలో కాకుండా చింతపల్లిలో ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, కాఫీ రైతు సంఘం నాయకుడు బౌడు కుసలవుడు అన్నారు. బుధవారం చింతపల్లి మండలంలోని గొంది పాకల పంచాయతీ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు అనుచరుడైన బోనంగి పందు పడాల్ 135వ జయంతి సందర్భంగా అధికారికంగా విచ్చేసిన అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు కాఫీ పల్పిన్ యూనిట్ పైన వినతిపత్రం సమర్పించారు. కాఫీ శుద్ధి కర్మాగారాన్ని చింతపల్లి మండలంలోనే ఉంచాలని, ఈ ప్రాంతం నుంచి తరలించవద్దని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో అంతర పంటగా ఉన్న కాఫీ చింతపల్లి, జీకే వీధి మండలాలలో వేల ఎకరాలలో ఐటీడీఏ పరిధిలో సాగు అవుతుందని, తద్వారా గిరిజన కుటుంబాలు ఇప్పుడిప్పుడే ఆర్థికంగా ఎదుగుదలకు దోహదపడు తుందన్నారు. నూతనంగా ఏర్పడిన అల్లూరి జిల్లాలో పెద్దగా పరిశ్రమలు లేవని, గిరిజనులు సాగు చేస్తున్న. కాఫీ, మిరియాలు, వసుపు, మొక్కజొన్న, చింతపండు, అడ్డాకులు, చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే గిరిజన ప్రాంతం ఆర్థికంగా మరో ముందడుగు వేసి అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నామన్నారు. వేలాది మంది గిరిజన యువతి, యువకులు ఉపాధి లేక ఎదురుచూస్తున్నారని, ఈ తరుణంలో చింతపల్లిలో సుమారు పది కోట్లు పెట్టుబడితో నెలకొల్పిన కాఫీ శుద్ధి కర్మాగారం నర్సీపట్నం ప్రాంతానికి తరలిస్తున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇదే జరిగితే గిరిజనుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అవుతుందని అన్నారు. 100% ఉద్యోగాలను ఇచ్చే జీవో నెంబర్ 3 రద్దు కావడం, హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో నీళ్లను కూడా తీసుకుపోవటానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, కనీసం ఈ ప్రాంతంలో కాఫీ రైతులు పండిస్తున్న పంటలను కూడా శుద్ధి చేసే కర్మగారాన్ని ఉంచకపోతే గిరిజనులు నిరాశ, నిస్పృహకు గురై మరో ఆలోచనకి గురయ్యే ప్రమాదం లేకపోలేదని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.. 5వ షెడ్యూల్ ప్రాంతంలో పూర్తి అధికారం గిరిజనులకే తప్ప మరి ఏ ఇతర సంస్థలకు, ప్రభుత్వానికి లేదు. గిరిజన ప్రాంతంలో పిసా గ్రామసభ అధికారాలు బలంగా ఉన్నాయి. ఈ తరుణంలో ఈ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ శుద్ధి కర్మాగారాన్ని ఇక్కడ నుండి తీసుకు వెళ్లడం అనేది జరిగితే గిరిజన చట్టాలకు, హక్కులకు భంగం కలిగించడమే గాక గిరిజన ప్రాంతానికి అన్యాయం చేయడమే అవుతుందని, ఈ విషయాన్ని తమరు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదివాసి గిరిజన కాఫీ రైతుల తరపునుంచి కోరుతున్నట్లు వారు తెలిపారు.. కాఫీ శుద్ధి కర్మాగారం కాపాడుకోవడం కోసం అవసరమైతే. చింతపల్లి మండలం 24 గంటలు అష్ట దిగ్బంధనం చేసేందుకు సైతం వెనకాడ బోమని చెప్పడం జరిగింది అన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ. కాఫీ శుద్ధి కర్మాగారాన్ని ఇక్కడి నుంచి తరలించేది లేదని అవసరమైతే ఇంకో పది కోట్లు పెట్టుబడి పెట్టేందుకు నేను ప్రయత్నిస్తున్నానని ఇచ్చిన వినతి పత్రానికి సమాధానం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్.కాఫీ రైతు సంఘం జిల్లా ప్రతినిధి జనకాని కనకారావు తదితరులు పాల్గొన్నారు.

పండుపడాల్ స్వగ్రామాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం : కలెక్టర్ దినేష్‌కుమార్

- పండుపడాల్ విగ్రహానికి కలెక్టర్ తెదేపా పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి నివాళి

విశాలాంధ్ర-చింతపల్లి : స్వాతంత్ర్య సమరయోధుడు బోనంగి వందు పడాల్ స్వగ్రామమైన గొందిపాకలను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. తెదేపా పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరితో కలసి బుధవారం గొంది పాకల గ్రామాన్ని సంద ర్శించారు, తొలిసారిగా అధికారి కంగా అల్లూరి సీతారామరాజుతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న బోనంగి పండుపడాల్ 135వ జయంతిని ఆయన స్వగ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామసచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతమైన లంబసింగికి దగ్గర్లోనున్న గొందిపాకలులో పర్యాటకులు పర్యటించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. గ్రామం మధ్యలో పండుపడాల్ విగ్రహం ఏర్పాటు, గ్రామంలో గృహ నిర్మాణాలు చేస్తామన్నారు. ఇక్కడ గిరిరైతులు పండించే స్ట్రాబెర్రీ, అవకాడ, డ్రాగన్ ఫలాలు తదితర సేంద్రియ పంటల అమ్మకాలు నిర్వహించేందుకు స్టాల్స్ను ఏర్పాటు చేస్తామన్నారు. హెూమ్స్టే నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు పండుపడాల్ స్వగ్రామం చూడడానికి వెళ్లే పర్యాటకులకు అన్ని సౌకర్యాలుకల్పించేందుకు కృషి చేస్తామన్నారు. తాజంగిలో నిర్మాణమవుతున్న స్వాతంత్ర్య సమరయోధుల (ఫ్రీడం ఫైటర్) మ్యూజియంలోని వివిధ స్టాల్స్కు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెడతామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు అన్ని విధాల సహాయ, సహకారాలు అందజేస్తామన్నారు. పండు పడాల్ పోరాటం, జీవిత చరిత్ర అందరికీ తెలిసే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పండువడాల్ కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో ప్రసాద్, ఏపీడీ లాలం సీతయ్య, రీసెర్చ్ ప్రొఫెసర్ శంకర్రావు, తెదేపా నాయకులు బోర్రా విజయరాణి, పూర్ణచంద్రరావు, బేతాలుడు, అబ్బాయినాయుడు, ఆనంద్, సోమేష్, కాసిం వల్లి, ఉపాధ్యాయుడు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరమామిడిగొంది గ్రామాన్ని సందర్శించిన సీలేరు ఎస్సై

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం సీలేరు ఎస్సై రవీంద్ర బుధవారం దారకొండ పంచాయతీ నరమామిడిగొంది గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజనులకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం స్టడీ మెటీరియల్, వాలీబాల్ కిట్లు అందజేశారు. దోమ తెరలు పంపిణీ చేశారు. అనంతరం ఎస్సై వారితో మాట్లాడుతూ గంజాయి జోలికి పోరాదన్నారు. నాటుసారాకు దూరంగా ఉండాలని చెప్పారు. నాటుసారా వల్ల జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ పోతురాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోడ్రైవర్లకు జీవన ఉపాధి పై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. తమ సొంత పెట్టుబడితో ఫైనాన్స్ తీసుకువ చ్చి ఆటోలు నడుపుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ కుటుంబాలు వీధిలో పడతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే పునరాలోచించి ఆటో డ్రైవర్ల కుటుంబాలను సంవత్సరానికి 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం, ఆటో కొనుగోలుకు సబ్సిడీ రుణం ఇవ్వాలని, ఆటో కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని, డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని చెప్పారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆటో కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

పి.మాకవరం పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన

కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ

విశాలాంధ్ర-కొయ్యూరు : శక్తి ఆప్ పై విద్యార్థులు అందరూ అవగాహన కలిగి ఉండా కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటరమణ తెలిపారు. అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి స్పర్శ ఫోక్సో చట్టం మహిళల భద్రత బాల్యవివాహాలు నియంత్రణ వంటి వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. అలాగే సెల్ ఫోన్ ద్వారా అపరిచిత వ్యక్తుల నుండి ఎటువంటి సమాచారం వచ్చిన ఓటీపీలు వంటివి ఇతరులకు చెప్పకూడదని తెలిపారు. అదేవిధంగా గిరిజన ప్రాంతంలో యువతను చెడగొడుతున్న మహమ్మారి గంజాయి వంటి వాటికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మతోపాటు సిబ్బంది ప్రధానోపాధ్యాయురాలు ఎస్ సంధ్య విద్యార్థులు తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ

విశాలాంధ్ర-బెలగాం : యువత ఏ దేశానికైనా ప్రధాన శక్తి, దేశ అభివృద్ధిలో యువత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థులచే నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో పెద్దసంఖ్యలో యువత చేరడం చాలా ముఖ్యమని, దేశం యొక్క ఈ సవాలును స్వీకరిస్తూ, ఈ రోజు మనం నషా ముక్త్ భారత్ అభియాన్ కింద ఐక్యంగా ఉన్నామని, మన సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా మనం కూడా మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్నామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మార్పు మనతోనే ప్రారంభం కావాలని కాబట్టి మనమందరం కలిసి మన పార్వతీపురం మన్యం జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి దృఢమైన నిర్ణయం తీసుకుందామని, నా దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి నా శక్తి మేరకు నేను కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ టి.రవికుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం: మాదకద్రవ్య రహిత భారతదేశం ప్రచారంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవహారం నిర్వహించి విద్యార్థులతో నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దాలినాయుడు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి అందరూ కృషి చేయాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా జమాల్ ఖాన్

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులుగా జమాల్ ఖాన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి, మఠం భాస్కర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకి సముచిత స్థానం ఖచ్చితంగా ఉంటుందని అన్నారు. మండలం లో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంస్థాగత ఎన్నికలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాటాడుతూ పార్టీలో నిబద్ధత, క్రమశిక్షణతో ఉండాలని కోరారు. అలాంటి కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. పార్టీలో విభేదాలు లేకుండా సక్రమంగా సాగుతూ అభివృద్ధి సంక్షేమాలను అందిపుచ్చు కోవాలని దానికి సమర్థ నాయకత్వం అవసరం అన్నారు. అనంతరం నిర్వహించిన చింతూరు మండలపార్టీ అధ్యక్షులు ఎన్నికల కార్యక్రమంలో జమాల్ ఖాన్‌ని ఏకగ్రీవంగా గ్రామ, క్లస్టర్, బూత్ , మండల కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ జమాల్ ఖాన్ ఎన్నికను ఆమోదించినట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జమాల్ ఖాన్‌ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జమాల్ ఖాన్ మాటాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిల బెట్టుకుంటానని ప్రతీ కార్యకర్తకి అందుబాటులో ఉంటూ పార్టీకి మంచిపేరు తెస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు విజయ్ భాస్కర్, చింతూరు మాజీ మండలపార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పిఎసిఎస్ చైర్మన్, ఏఎంసి డైరెక్టర్లు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: నర్సిపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షులు నియమితులైన జనసేన పార్టీ నాయకులు ఆగూరుమణి, ఏఎంసి డైరెక్టర్లుచిట్లు హిమబిందు, పెదిరెడ్ల హిమబిందు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఉదయం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పూలమాలతో సత్కరించి, వారి అభిమానాన్ని చాటుకున్నారు. పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లుగా ఎంపికైన వీర మహిళలుకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు మంచి సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఆగూరు మని మాట్లాడుతూ తమ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తరహాలోనే చంద్రబాబు నాయుడు కూడా మహిళల అభ్యున్నతి కోసం పాటుపడడం ఎంతో హర్షించదగ్గ విషయం, పిఎసిఎస్ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని, ప్రతి రైతు సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరిస్తా నని, ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతి రైతుకు అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలను ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా చేయడం సురక్షితం

విశాలాంధ్ర-అడ్డతీగల : రంపచోడవరం ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన సదస్సు స్థానిక వేటమామిడి సమావేశ మందిరంలో ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో కౌన్సిలర్స్ గా పనిచేస్తున్న జి విశ్వనాథ్, ఎం సుకుమార్, మరియు ఎస్ అనిల్ సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి ఆర్థిక లావాదేవీలు కోసం ప్రభుత్వరంగ బ్యాంకులు వద్ద చేసుకోవాలని, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన,మరియు సుకన్య సమృద్ధి యోజన మొదలైన సామాజిక భద్రత పథకాల కోసం, సైబర్ క్రైమ్ కోసం వివరించడం జరగింది. ఏ ప్రభుత్వంగ బ్యాంక్ అయినను తమ లావాదేవీల కోసం ఓటిపిని కానీ సివివి నెంబర్ను కానీ అడగదని ఎవరైనా ఓటీపీ కానీ సివిపి నెంబర్ గాని అడిగినట్లయితే స్థానిక పోలీస్ స్టేషన్లో గాని లేదా ప్రభుత్వ రంగ బ్యాంకు వద్ద అయినా కంప్లైంట్ చేయవచ్చని తెలిపారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

చింతపల్లి వారపుసంతలో ర్యాలీ

విశాలాంధ్ర-చింతపల్లి : క్షేత్ర స్థాయిలో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని రాఘవేంద్ర నగర్(ఆర్ వి నగర్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజా రవీంద్ర నాధ్ చౌదరి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి ఆదేశాల మేరకు జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (టీబీ ముక్త్ భారత్ అభియాన్)లో భాగంగా మండల కేంద్రమైన చింతపల్లిలో పాత బస్టాండ్ కూడలిలో చింతపల్లి మండల టీబీ యూనిట్ సూపర్వైజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో టీ బీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన వైద్య సిబ్బంది తో కలిసి పాత బస్టాండ్ కూడలి లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ కూడలి నుంచి సంత మార్కెట్ మీదుగా హనుమాన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో మనందరి పంతం - టీ.బీ.అంతం, టీ.బీ.ఓడిపోతుంది - దేశం గెలుస్తుంది. టీ బీ పట్ల శ్రద్ధ వహించండి-టీ బీ ముక్త్ భారత్ సాధించండి. అందరూ కలసి చేయి చేయి కలుపుదాం - టీబీని ఓడిద్దాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ టీ బీ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలని, టీ బీ రహిత భారత్ కు ప్రతీ ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి, లక్షణాల పట్ల ప్రజలు అవగాహన పెంచు కోవాలని సూచించారు. రెండు వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. వైద్య పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే, భయపడవలసిన అవసరం లేదని, క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాది నయం అవుతుందని, ఈ మందులు పూర్తిగా ఉచితమన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎం పి హెచ్ ఈ ఓ. జాన్సన్., ఎం ఎల్ హెచ్ పి/సి హెచ్ ఓ.లు లక్ష్మీ, పావని, ఎస్ టి ఎల్ ఎస్ గౌరీ, వైద్య సిబ్బంది కే. ఎన్. ఎన్. నెహ్రూ, లక్ష్మి, రవణమ్మ, నాగరత్నంతో పాటు ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మొన్న వరి నాట్లు... నేడు ట్రాక్టర్

అన్నదాత సుఖీభవలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: వ్యవసాయ రంగం పట్ల తనకి ఉన్న మక్కువను ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ఏదో ఒక విధంగా చాటుతున్నారు. మొన్న మండల పర్యటనలో భాగంగా అయినా బాలగొడవలో వరి నాట్లు వేసి, కూలీలతో మమేకమై, అందరినీ ఆశ్చర్యపరిచి, రైతు కుటుంబంలో రైతు బిడ్డలా పంచికట్టుతో పొలంలో దిగి వరి ఉభాలు వేసిన సంగతి తెలిసిందే. బుధవారం మండలంలో జరిగిన ఓ కార్యక్రమంలో ట్రాక్టర్ నడిపి అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. కూటమి ప్రభుత్వం హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ లో ఇచ్చిన రైతు సుఖీభవ పథకంలో ఇటీవల అన్నదాతల ఖాతాల్లో నిధులు జమ చేసిన సంగతి తెలిసిందే. దీన్ని పురస్కరించుకొని విజయోత్సవ ర్యాలీ మండలంలో నర్సిపురం గ్రామం నుంచి బుధవారం చేపట్టారు. ఈ విజయోత్సవ ర్యాలీలో భాగంగా తొలుత గ్రామంలో గల అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించి అన్నదాత సుఖీభవ అంటూ నినాదాలు చేస్తూ భారీ ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు. తొలి ట్రాక్టర్ను రైతులతో కలిసి ఎమ్మెల్యే విజయ్ చంద్ర నడుపుతూ , సుమారు 6 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి సుజాతనగర్, ఓలేటి ఫారం, వైకెయం, వెంకంపేట కూడలి, బెలగాం, నాలుగు రోడ్ల కూడలి, పాత బస్టాండ్ దాటుకుంటూ ప్రధాన రహదారి మీదుగా మార్కెట్ యార్డ్ వరకు చేరుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ఎంతో ఉత్సాహంతో ట్రాక్టర్ నడపడంతో రైతులతో పాటు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం రైతు పక్షపాతి అని వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం లాభసాటి చేస్తుందని భరోసా ఇచ్చారు గత సైకో పాలనలో ప్రాజెక్టులన్ని మూలకు చేరాయని వాటన్నింటినీ కూటమి పాలనలో జీవం పోస్తామని ప్రతి ప్రాజెక్టును పూర్తి చేసి సస్యశ్యామలంగా సాగునీరు అందిస్తామన్నారు. రైతు ఆనందంగా ఉన్నప్పుడే రాష్ట్రం దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రతి రైతు ఆనందంగా వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్ లో ఎక్కడా కూడా ఎరువుల కొరత గాని, నకిలీ విత్తనాల దందా లేదని ఇదంతా చంద్రబాబు గొప్పతనం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చంద్రమౌళి, గొట్టాపు వెంకట్ నాయుడు, గురజాన చంద్రమౌళి, ఏం సి చైర్మన్ గొట్టాపు రమణ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదనే త్రిసభ్య కమిటీలు నియామకం

- కష్టకాలంలో కలిసి నడిచినవారికి పదవుల పంపిణీలో పెద్దపీట
- పిఏసిఎస్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు : ఆరునెలల వ్యవధిలో పిఏసిఎస్ ఎన్నికలు జరుగుతాయని ఈలోపు రైతులకు ఇబ్బంది కలగనివ్వకూడదనే సదుద్దేశంతో పిఏసిఎస్ లకు త్రిసభ్య కమిటీలను నియమించడం జరిగిందని మంత్రి సంధ్యారాణి అన్నారు. బుధవారం శ్రీశ్యామలాంబ ఆలయ ఆవరణలో సాలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్,సభ్యుల ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్య అతిధిగా మంత్రి సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ నక్కెళ్ళ వెంకటరమణ,సభ్యులు గాడి లక్ష్మణ, మీసాల నవీన్ కుమార్ లచేత మంత్రి సంధ్యారాణి ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా ఎంపిక అయిన కమిటీని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిఏసిఎస్‌లు రైతులకు ఆయువు పట్టు వంటివి అన్నారు. రైతులకు లబ్ధి చేకూర్చేందుకు పిఏసిఎస్‌లు పనిచేస్తున్నాయన్నారు. సాలూరు నియోజకవర్గంలో 12 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయన్నారు. వీటన్నిటికీ త్రిసభ్య కమిటీలను నియమించామన్నారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతుందన్నారు. రైతే రాష్ట్రానికి వెన్నుముక అని రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. చంద్రబాబు సుపరిపాలనలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజల కోరికలు ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన కొనసాగుతుందన్నారు.

నామినేటడ్ పదవుల పంపకంలో కష్టకాలంలో కలిసి నడిచిన వారందరికీ పెద్ద పీట వేస్తున్నామన్నారు. అందులో భాగంగా కూటమి ధర్మానికి కట్టుబడి జనసేన నాయకులకు పదవులను కట్టబెడుతున్నామని చెప్పారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు తన వెంట నడిచిన వారిని విస్మరించనన్నారు. వారందరికీ అవకాశం వచ్చినప్పుడు పదవులు పొందేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాబోవు పురపాలక సంఘ ఎన్నికలలో ఘనవిజయం సాధించి రెట్టించిన ఉత్సాహంతో అంగరంగ వైభవంగా శ్యామలాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోనే విజయోత్సవ సభ జరుపుకుందామని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), భాజపా నియోజకవర్గ ఇంచార్జ్ గొర్లె భాను, శ్యామలాంబ ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ అక్కాన అప్పారావు,జనసేన నాయకులు శివ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్పత్తి మాది... ఉపాధి వాళ్ళకా

- మన్య ప్రాంతాన్ని వాణిజ్యపరంగా అభివృద్ధిపరచండి
- కాఫీ, మిరియాలు, పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు చింతపల్లిలో నెలకొల్పండి
- మన్య ప్రాంతంపై సవితి ప్రేమ చూపుతున్న కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలో విరివిగా పండే కాఫీకి సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్‌ను మైదాన ప్రాంతంలో నెలకొల్పడం ఎంతవరకు సమంజసమని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. వైకాపా మండల అధ్యక్షుడు పాంగి గణబాబు, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతలతో కలిసి బుధవారం వారు మాట్లాడుతూ మన్య ప్రాంతంలో వేల ఎకరాలలో కాఫీ తోటలను పెంచి లక్షల టన్నుల కాఫీ ని గిరిజనులు ఉత్పత్తి చేస్తుంటే ఆ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ను మైదాన ప్రాంతంలో నెలకొల్పి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇప్పటికే జనాభా పెరగడం వలన ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయన్నారు. ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్న గిరిజన నిరుద్యోగ యువతను అన్ని విధాలుగా ఆదుకోవలసిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకుండా కోట్లాది రూపాయల నిధులతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ను మైదాన ప్రాంతంలో నెలకొల్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్పత్తి గిరిజనులది, ఉపాధి గిరిజనేతరులది అన్న చందంగా పాలకులు, అధికారులు నిర్ణయాలు చేయడం మన్య ప్రాంత ప్రజల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న సవతి ప్రేమకు నిదర్శనం అన్నారు. అనునిత్యం వ్యవసాయాన్ని నమ్ముకుని అటు కాఫీ, ఇటు మిరియాలు, పసుపు తదితర వాణిజ్య పంటలను పండించి తమ బిడ్డల కైనా కాఫీ, మిరియాలు, పసుపు వంటి ప్రాసెసింగ్ యూనిట్ ల ఏర్పాటు వలన ఉపాధి అవకాశాలు లభిస్తాయనుకుంటే ఈ కాఫీ పంటకు సంబంధించి ఒక కంపినీ సుమారు 10 కోట్ల రూపాయలతో నర్సీపట్నం ప్రక్కన శెట్టిపాలెంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం పాలకులకు ఈ ప్రాంత యువతపై ఉన్న సవతి ప్రేమకు నిదర్శనం అన్నారు. కాఫీ పండేది మన్య ప్రాంతంలో, కాఫీ ప్రాసెసింగ్ కంపెనీ పెట్టేది మైదాన ప్రాంతంలోనా అని వారు ప్రశ్నించారు.

పంట మనది.. వంట వారిది : నర్సీపట్నంలో కంపినీ పెడితే అక్కడి యువత కు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయి. ఇప్పటికే ఎంతోమంది గిరిజన యువత డిగ్రీలు చదువుకొని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక బ్రతుకు తెరువు కోసం, పొట్టచేత పట్టుకొని కోళ్ల ఫారాలకు, చేపల, చెరువులకు, ఇటుక బట్టీలకు వలస వెళ్లడం మనం చూస్తున్నామన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో కోట్ల రూపాయలతో నిర్మాణం చేసి, వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ని నర్సీపట్నంలో పెట్టడం, అక్కడి ప్రజలకు, అక్కడి యువతకు లబ్ధి చేకూరే విదంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదే ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ ప్రాంతంలో నెలకొల్పితే కాఫీ పంటకు గిట్టుబాటు ధర రావడం జరుగుతుందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని, తద్వారా వేరే ప్రాంతానికి వలస వెళ్లే అవసరం ఉండదని, నర్సీపట్నంలో పెట్టే కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ని చింతపల్లిలోనే ఏర్పాటు చేయాలనే డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా ప్రతి ఒక్కరు ఉద్యమించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో ఎంపీడీవో కే సత్యం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశానుసారం దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం సీతంపేట దగ్గర నుండి ఎన్టీఆర్ అడ్వాన్చర్ పార్క్ వరకు ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సదరు కార్యక్రమంలో సీతంపేట మండలంలో గల అందరు పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయాలు సిబ్బంది పాల్గొని దేశభక్తి నినాదాలతో గ్రామ ప్రజలలో దేశభక్తి భావం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో భాగంగా సీతంపేట పార్క్ ఎదురుగా మానవహారం ఏర్పాటు నినాదాలు చేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో కే. సత్యం మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అన్నిఇల్లుపై కూడా జాతీయ జెండా ఎగరాలని అందరూ దేశభక్తిని కలిగి ఉండాలని చెప్పడం జరిగింది.

ఎటపాక : ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో

భాగంగా హర్ ఘర్ తిరంగా యాత్ర ఎటపాక మండలం నెల్లిపాక గ్రామం నుండి చోడవరం గ్రామం వరకు మోటర్ సైకిల్ పై తిరంగా యాత్ర చేయడం జరిగింది. యాత్ర నెల్లిపాక సెంటర్ నుండి ప్రారంభమయ్యి చోడవరం గ్రామం వరకు అక్కడ నుంచి నెల్లిపాక గ్రామంలో కూడా తిరంగా యాత్ర చేసారు . తిరంగా యాత్ర విశిష్టత దాన్ని ప్రధాని మోడీ ప్రవేశపెట్టారు అనే విషయాలను మండల అధ్యక్షులు తెలియజేసారు. ఇలాంటి యాత్ర ద్వారా ప్రజల్లో జాతీయ జెండా ప్రతి రైతు ఇంటి మీద ఉండాలి అనే విషయం గురించి అవగాహన కల్పించారు అలాగే స్వతంత్ర సమరయోధుల ప్రాణత్యాగాలు చిరస్మరణీయమని, మరచిపోలేనివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూడే. సతీష్ కుమార్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి మడకం. వెంకటేష్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి. రామకృష్ణ, కొర్సా. రామకృష్ణ, గుండి. నాగిరెడ్డి, తెల్లం. శ్రీన, కనితి అజయ్, సాయం సంతోష్, మోసం రాంచరణ్, కనితి కళ్యాణ్, తుర్రం విజయ్, సోడా శేఖర్ మరియు నెల్లిపాక గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

కురుపాం : విద్యార్థి దశ నుండే దేశభక్తిని భారతీయులందరినీ

గౌరవించే తత్వం ప్రతిఒక్క విద్యార్థి అలవర్చుకోవాలని ఎం.జె.పి. పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. బుధవారం హర్ ఘర్ తీరంగా పాఠశాల నుండి కురుపాం బస్ స్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం, జాతీయ జెండాను గౌరవిస్తూ భారతీయుల మందిరం భిన్నత్వంలో ఏకత్వముల కలిసి మెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బోట్ అనిల్, గౌడ్ బాలంకి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలలో' హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం : స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుదవారం నిర్వహించారు. జాతీయ పతాకాలు పట్టుకొని వందే మాతరం భారత్ మాతాకి జైవంటి దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు మాట్లాడుతూ ప్రతి ఇంటి మీద జాతీయ పతాకం ఎగరేయడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, దేశంపట్ల ప్రతిపౌరుడి బాధ్యతను గుర్తించాలని, ఈవిధమైన కార్యక్రమాలు మనలో ఐక్యత, సోదరభావం, దేశసేవా భావాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బలగ శాంతకుమారి, ఎన్‌సిసి కెప్టెన్ గుప్తా,అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఆటలపోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన డిబేట్ క్విజ్ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతోపాటు కళాశాల విద్యార్థులతో నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉత్తమ లక్ష్యం కలిగి ఉండాలి

విశాలాంధ్ర-కురుపాం : విద్యార్థులు మత్తు

పదార్థాలు కు దూరంగా ఉంటూ, ఉత్తమ లక్ష్యం కలిగి ఉండాలని కురుపాం, నీలకంఠాపురం ఎస్సైలు పి.నారాయణరావు ఎ.నీలకంఠరావు విద్యార్థులకు సూచించారు. బుధవారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో, నీలకంఠపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో నసా ముక్త భారత్ అభియాన్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడల్లు వద్ద మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలుపై విద్యార్థులకు అవగాహన కల్పించి చెడు వ్యసనాలకు ఎవరు బానిస కాకుండా సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల, పాఠశాల, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎటపాకలో పోలీసులు అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-ఎటపాక : బుదవారం ఎటపాక సిఐ, ఎటపాక ఎస్సై సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత లో భాగంగా ఎటపాక నుంచి మేడివాయి వరకు ఆటో డ్రైవర్స్, పబ్లిక్‌తో పాటుగా రోడ్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన ర్యాలీ చేశారు. వాహన దారులు రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. రోడ్డు ప్రయాణ నియమాలు, వాహన పత్రాలు కలిగి ఉండడం లాంటి విషయాలపై ప్రజలకు, వాహన దారులకు వివరించారు. పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు, వాహన దారులు తదితరులు పాల్గొన్నారు.

పిఏసిఎస్‌లలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో గల బీజేపురం చిన మే రంగి పిఎస్ఎల్‌లో గల సభ్యులకు సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన సదస్సులు బుధవారం ఏర్పాటు చేశారు. బీజేపురం పిఏసిఎస్‌లో సీఈవో చీపురుపల్లి తిరుపతిరావు చనమేరంగి పిఏసిఎస్ లో సీఈవో సామల పోలిరాజులు దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం పై ఉపయోగం ఏమిటి ఏ విధంగా కావలసిన సమాచారం తీసుకోవాలి ఏసమాచారం ఎవరి వద్ద తీసుకోవాలి. తదితర అంశాలపై సభ్యులకు పూర్తిగా అవగాహన కల్పించి వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎస్ఎఫ్‌సిఎస్ సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ లైబ్రరీ డే నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం: స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయంలో నేషనల్ లైబ్రరీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఆయనచిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, కళాశాల లైబ్రేరియన్ టి గణేష్ కుమార్, అధ్యాపకులు గుప్తా, కిషోర్ కుమార్, పల్గునరావు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా విధంగా కృషి చేయాలి

విశాలాంధ్ర-బెలగాం/గరుగుబిల్లి : ప్రతీ ఆరోగ్య కార్యక్రమంపై వైద్య సిబ్బంది దృష్టి పెట్టాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కర్ రావు సూచించారు. గరుగుబిల్లి, గొట్టివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మాత్తుగా తనిఖీ చేసి అక్కడి వార్డుల్లో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓపి వివరాల రికార్డులు పరిశీలించారు. పిఎంజెఎవై, పిఎంఎవై, ఎన్.సి.డి.సి.డి. ఎనీమియా ఏక్షన్ కమీటీలతో చర్చించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వైద్యం దృష్ట్యా రోగులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రతీ ఆరోగ్య యాప్ లు, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలన్నారు. తద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించి అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణీలు, శిశువుల్లో అనారోగ్య లక్షణాలను వెంటనే గుర్తించాలని, ఫలితంగా ప్రమాదకర స్థితికి చేరకుండా జాగ్రత పడవచ్చన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యత గురించి వాటిలో అవసరమైన పోషకాలు విటమిన్లు ఉంటాయని గర్భిణీలకు బాలింతలకు అవగాహన కల్పించాలని, సాధారణ ప్రసావాలపై గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. ఇ-ఆశా యాప్‌లో ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం గొట్టివలస గ్రామంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. టి.జగన్మోహన్రావు, వైద్యాధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్, సూపర్వైజర్లు జగదీశ్వరి, ఉదయ్‌కుమారి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

విశాలాంధ్ర-కొమరాడ : ప్రతి ఒక్క విద్యార్థి దేశభక్తిని పెంపొందించేందుకు వ్యాచారచన పోటీలు పెట్టి బహుమతులు అందజేస్తున్నట్లు శ్రీ రేణుక స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి రేణుక అన్నారు. బుధవారం శివిని వద్ద ఉన్న రాయల్ అకాడమీ, శ్రీ రేణుక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రేణుక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధుల మహాత్మా గాంధీ జోహార్ లాల్ నెహ్రూ సుభాష్ చంద్రబోస్ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆరోజు స్వతంత్రం కోసం మరింతమందో స్వతంత్ర సమరయోధులు గురించి విద్యార్థులకు, దేశభక్తిపై పలు వ్యాసరచన పోటీలు ఆయా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు పెట్టి మొదటి ద్వితీయ తృతీయ స్థానాల్లో ప్రతిబి కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆగస్టు 15తేదీ నుంచి శ్రీ రేణుక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ నేర్పించడం అల్లికలు ఇతర రంగాల్లో శిక్షణ కార్యక్రమలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉద్యోగ అవకాశాల కోసం వివిధ కంపెనీలతో సంబంధలు ఏర్పాటు చేసుకొని చదువుకున్న యువతీ యువకులకు మంచి కంపెనీలో ఉద్యోగా అవకాశాలు జాబ్ కన్సల్టెన్సీ ద్వారా కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో ఉన్న మహిళలకు అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి వృత్తిని ఐపన్యం పెంపొందించే విధంగా ఈ సమస్త పనిచేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల్లో ఉన్న మహిళలు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని స్వాధీనం చేసుకొని వృత్తి నైపుణ్య పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్లు ఉమా, గోవిందు, కార్తీక్ తదితరులు ఉన్నారు.

సమాచార హక్కు చట్టం ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

పిఏసిఎస్ అధ్యక్షులు గులిపిల్లి సుదర్శన్‌రావు

విశాలాంధ్ర-కొమరాడ : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని కొమరాడ పిఏసిఎస్ చైర్మన్ గుల్లిపల్లి సుదర్శన్‌రావు అన్నారు. బుధవారం కొమరాడ పిఏసిఎస్ సొసైటీ వద్ద సమాచార హక్కు ఇతర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిఏసిఎస్ సొసైటీ ద్వారా రైతులు అందించిన ఎరువులు విత్తనాలు వివరాలను వెల్లడించారు. రైతులకు ఇప్పటివరకు అందజేసిన రుణాలు రికవరీ విషయాలు రైతులతో చర్చించి వారికి రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా రుణాలలో వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సమాచార హక్కు చట్టం విషయాన్ని రైతులతో చర్చించి అవగాహన కల్పించారు. భారతదేశపు ప్రభుత్వ రంగ ఉత్పత్తులలో దాదాపు 85 శాతం భాగం కేంద్ర ప్రభుత్వానికి, మిగిలిన 15 శాతం భాగం రాష్ట్ర ప్రభుత్వానికి చెందును. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉత్పత్తుల రంగాలలో సమాచార హక్కు చట్టం-2005 అమలులోకి వస్తుందని తెలిపారు. సమాచార హక్కు చట్టం - 2005ను అమలు చేయడానికి, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రభుత్వ నియమావళి ప్రకారం సమాచారమును ప్రజలకు అందించవలసిన బాధ్యత కలిగియుంటారుని తెలిపారు ఫలితంగా ప్రజలకు తగిన సమాచారాన్ని తక్కువ సమయంలో అందించడంలో, ప్రజాప్రభుత్వ రంగ సంస్థల పనితీరులో పారదర్శకతను తీసుకురావడంలో, ఈ సమాచార హక్కు చట్టం - 2005 ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు2005 చట్టం ప్రకారం ప్రజలకు తక్షణ సమాచారాన్ని అందించడంలో ఎంపిఎఫ్‌సి గోదాంలో ఉన్న అధికారులకు ప్రత్యేక బాధ్యత కలదని గోదాం లోపలి వస్తువుల వివరాలు, నిల్వ కాలపరిమితి వంటి సమాచారాన్ని ప్రజలకు పారదర్శకంగా అందించవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను పూర్తిస్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మరిచర్ల హైమావతి, ఎం.రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు మర్రిచెర్ల సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

రెవిన్యూ డివిజన్‌ను జిల్లా ఐనా చేయాలి లేదా పాలకొండను శ్రీకాకుళం జిల్లాలో కలపాలి

పాలకొండ జిల్లా సాధన సమితి విజ్ఞాపన

విశాలాంధ్ర-పాలకొండ : విజయవాడలో రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ ఉప సంఘం జిల్లాల పునర్విభజన పై తొలి సమావేశం జరగగా సదరు సమావేశానికి పాలకొండ జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షులు కనపాక చౌదరి నాయుడు, సబ్బా నానాజీ సాధన సమితి జిల్లా ట్రెజరర్‌లతో కూడిన ప్రతినిధి వర్గం బుధవారం విజయవాడలో కలిసి పాలకొండ రెవెన్యూ డివిజన్ జిల్లా అయినా చేయాలి లేదా శ్రీకాకుళం జిల్లాలో పాలకొండను చేర్చాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని వారు వెల్లడించారు. ఈ అంశంపై గౌరవ ఉప సంఘం సభ్యులు ఈనెల 29-30 తేదీలలో జిల్లా కేంద్రాలకు వచ్చి ప్రజల అభిప్రాయ సేకరణ తీసుకుంటామని తదుపరి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని మీ అభిప్రాయాల్ని నివేదికలో పొందుపరుస్తామని హామి నిచ్చినట్లు హాజరైన ప్రతినిధులు తెలియజేశారు. గతంలో జిల్లాల విభజన సమయంలో జరిగిన అన్యాయం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని కావున గతంలో పెద్దఎత్తున అన్ని వర్గాల ప్రజలతో కలిపి పాలకొండలో విడతల వారి ఉద్యమం జరిగిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలలో పాలకొండ విచ్చేసిన సమయంలో హామీ ఇచ్చిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇదే అంశంపై ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విషయాన్ని సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ఈస్ట్, వేస్ట్, జిల్లాలు విభజనపై ప్రజలలో పెద్ద నిరసనలు తెలియజేయగా పాలకుపక్షం కమిటీ వేసి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియ జేసుకొనుటకు అవకాశం కలిగి ఉన్నదని కావున త్వరలోనే పాలకొండలో అన్ని వర్గాలతో రాజకీయాలకు అతీతంగా సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కమిటీ దృష్టికి తీసుకు వెళ్తామని పాలకొండ జిల్లా సాధన సమితి అధ్యక్ష,కార్యదర్శులు బుడితి అప్పలనాయుడు,వండాన కూర్మారావులు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ప్రిన్సిపాల్



విశాలాంధ్ర-కురుపాం : మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ ఎం. కుమారస్వామి అన్నారు. మాదకద్రవ్య రహిత భారతదేశం ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించి మాదకద్రవ్యాలు వలన కలిగే అనర్థాలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యార్థి దశ నుండే సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడి కుటుంబానికి భరోసాగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం యూనిట్ అధికారులు ఎ. రామ్మోహన్ రావు ఎం.రమేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజశేఖర్ రక్తదానం చేసి మహిళకు జీవం పోశాడు



విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ పట్టణానికి చెందిన కూటమి కార్యకర్త లోడగల రాజశేఖర్ బుధవారం సంతకవిటి మండలం పోతురాజుపేట గ్రామానికి చెందిన కె.రామలక్ష్మి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు చికిత్స చేస్తున్న వైద్యులు తీవ్రమైన రక్తహీనతతో బాధపడు తున్న రామలక్ష్మి కి రక్తం అత్యవసరంగా ఎక్కించాలని వైద్యులు వెల్లడించారు విషయం తెలుసుకున్న రాజశేఖర్ ముందుకు వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తదానాన్ని చేశారు వైద్యులు పరీక్షలు నిర్వహించి రక్తాన్ని ఎక్కించడంతో ఆమె కోలుకున్నారు రక్తదానం చేసిన రాజశేఖర్ ను జనసేన జానీ జగన్

రైతు సదస్సు, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహణ

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండల పరిధిలోగల ఏనుగురాయి కొండపడ గ్రామాలలో రైతు సదస్సు, పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం వ్యవసాయ శాఖ అనుబంధ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించామని వ్యవసాయ శాఖ అధికారి జి.మురళీకృష్ణ తెలిపారు ఆయన బుధవారం ఈ కార్యక్రమాన్ని ముఖ్య ఉద్దేశం రైతులతో మాట్లాడుతూ రైతులు పండించే వరి రాగులు పంటలపై పలు సూచనలు సలహాలు పాటించవలసిన పద్ధతులు తెలిపారు రాగులు పంట విత్తిన తరువాత చెయ్యవలసిన. యాజ్య మన్య పద్ధతులు ప్రకృతి వ్యవసాయం ఘన జీవామృతం ద్రవ జీవామృతం. వేప కషాయం తయారీ విధానం రైతులు వరి.కి రాగి పంటలలో ఏవిధంగా ఉపయోగించాలి అనేది వివరించటం జరిగింది పిఎంఎఫ్‌బివై ఇన్సూరెన్స్ వరి పంట కి ఎంత కట్టాలి.,ఏ విధంగా ఉపయోగ పడుతుంది.,అలాగే రైతులు దగ్గర వాళ్ళు వాడుతున్న పనిముట్లు ఇవి కాకుండా రైతులకి కావలసిన పవర్ టిల్లర్లు తార్పలీన్లు ఎంత మంది రైతులకి కావాలి అనేది రైతులు వారిగా తీసుకోవటం జరిగిందనారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ఇప్పటికీ బ్యాంకుల్లో రైతులకి డబ్బులు పడక పోయినట్లయితే వాళ్ళు రైతు సేవ కేంద్రాల పరిధిలో గల వ్యవసాయ సహాయకులు దగ్గరికి తమ ఆధార్ కార్డులు తీసుకొని వెళ్తే వాళ్ళకి ఎందుకు రావటం లేదు.తండ్రి పేర్లు మీద పొలం ఉండి పిల్లలు మ్యుటేషన్ చేయించు కోకుండా తమ ఆధార్ కార్డులు చనిపోయిన తండ్రులు పేరుకు లింక్ అయి ఉన్నాయి. ఇలా ఉన్న ప్రతి రైతుకు సచివాలయం లో ఉండే డిజిటల్ అసిస్టెంట్ దగ్గర అప్లికేషన్ పెట్టుకొని గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా కరెక్షన్ చేయించుకొని తహశీల్దార్ గారి ద్వారా అప్డేట్ చేయించుకోవా లన్నారు అప్పుడు మళ్ళీ గ్రీవెన్స్ నందు మన వ్యవసాయ సహాయకులు సరి చేసి పంపిస్తారు వాళ్ళందరికి వెంటనే అన్నదాత సుఖీభవ కు అర్హులు అవుతారన్నారు ఈ ప్రాసెస్ రైతులు అందరూ వారి వివరాలు సరి చేసుకోవాలన్నారు ఈ ఏడాది 2025 ఈ పంట వేసుకున్న ప్రతి రైతు. పంట నమోదు చేసుకోవాలి. ముఖ్యంగా వరి రాగులు వేసుకున్న రైతులు మీ వివరాలు వ్యవసాయ సహాయకులకి ఇస్తే వాళ్ళు ఆన్లైన్‌లో ఎంటర్ చేస్తారు. ఈ విధంగా రైతుకు కావలసిన మిగతా పథకాలు గుర్చి కూడా వివరించటం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరగాం నర్సింగరావు ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ రత్నా కుమారి ప్రకృతి వ్యవసాయం ఐ సి ఆర్ పి దామోదరం,యూనిట్ ఇంచార్జి చిట్టిబాబు ఎఫ్ బి ఓ తరుపున నాగరాజు గ్రామ వ్యవసాయ సహాయకురాలు పుణ్యవతి రైతులు పాల్గొన్నారు.

స.హా. చట్టంపై అవగాహన తప్పనిసరి

పిఏసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్

విశాలాంధ్ర-కురుపాం : ప్రతీ ఒక్కరు సమాచార హక్కు చట్టం పై అవగాహణ కలిగి ఉండాలని కురుపాం పి.ఏ.సి.ఎస్ చైర్మన్ డొల్లు కిషోర్ అన్నారు. బుధవారం జిల్లా సహకార అధికారి వారి ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సును పి.ఏ.సి.ఎస్ కార్యాలయంలో సంఘ సభ్యులకు,రైతులకు సమాచార చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సంధర్బంగా అయను మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 మే 11న ఆమోదించ బడిందని దీని ఉద్దేశ్యం ప్రతీ అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబు దారి తనం తీసుకు రావడానికి, అధికార యంత్రాంగం అధీనంలో ఉన్న సమాచారం ప్రజల కోరిక మేరకు అందివ్వడం లక్ష్యమని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జ్ సీఈఓ జి.రాము, సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ గంగులయ్యకి సంకాడ జనసేన పార్టీ కమిటీ అభినందనలు

విశాలాంధ్ర-జికె వీధి : అరకు పార్లమెంటరీ, పాడేరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు & సృజనాత్మకత అకాడమీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా గూడెం కొత్తవీధి మండలం సంకడ పంచాయతీ జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు ఉలం ఈశ్వరరావు తన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి గ్రామ కమిటీ, ప్రజలు తరుపున హృదయపూర్వక అభినందనలు తెలియ జేశారు. అలాగే పాడేరు నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు, క్రియాశీల సభ్యులు, వీర మహిళలు, జనసైనికులు ఆయన సేవలు కొనియాడారు. జనసేన పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించి కృషి చేస్తున్న గంగులయ్య మరెన్నో పదవులు చేపట్టాలని, ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆ లక్ష్యాన్ని చేరుకుంటారని, మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని సంకాడ పంచాయతీ జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు ఉలం ఈశ్వరరావు అన్నారు. ఈకార్యక్రమంలో డి.కోటి బాబు, జె బాబురావు, డి వీరన్న పడాల్, ఎస్.రాజు పడాల్, వి బాలు, వీర మహిళలు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహన నడిపితే చట్టపరమైన చర్యలు

జీకే వీధి సీఐ వరప్రసాద్

విశాలాంధ్ర-జీకే వీధి : పోలీస్ శాఖ నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మండల కేంద్రంలో హెల్మెట్ ధరించని వాళ్లని 70-80 మందిని, ద్వి చక్ర వాహనాలు పోలీస్ స్టేషన్ కి తీసుకుని వచ్చి ఈ మధ్యకాలంలో జరుగుతున్నటువంటి ప్రమాదంలో ఎలా ప్రాణాలు కోల్పోతున్నారు అనే దానిమీద కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని జీకే వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ కొనుక్కొని తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఎవరికి ఫైన్ విధించకుండా అందరికీ పరివర్తన వచ్చేటట్టుగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎవరైనా ఇక నుండి హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ వరప్రసాద్ హెచ్చరించారు.

కాలానుగుణ రుగ్మతలకు ఆయుర్వేదంతో మేలు : డాక్టర్ హేమాక్షి

విశాలాంధ్ర-బెలగాం/జియ్యమ్మవలస : సీజనల్, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదంతో ఉపశమనం ఉంటుందని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈమేరకు జియ్యమ్మవలసలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పలు ఆరోగ్య సమస్యలతో ఉన్న వారికి డాక్టర్ హేమాక్షి తనిఖీలు చేపట్టి ఆయుర్వేద మందులు అందజేశారు. ముఖ్యంగా వాత నొప్పులు, కీళ్ళవాత, ఆమ్లపిత్త, మూల వ్యాధి, చర్మ వ్యాధుల సమస్యలతో ఉన్నవారు శిబిరాన్ని వినియోగించుకున్నారు. వారికి అవసరమైన ఆయుర్వేద మందులు లవణ భాస్కర్ చూర్ణ, దాడి మాస్టర్‌కి చూర్ణ, కర్పూరాదితైలం, సాచారాది తైలం, అభయారిష్ట, అమృత అరిష్ట అందజేసి వినియోగించు విధానాన్ని వివరించారు. మన పరిసరాల్లో ఉండే ఆయుర్వేద ఔషధ మొక్కల ప్రాముఖతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీరు త్రాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద సిబ్బంది శ్రీనివాసరావు, విజయ, పైడితల్లి, పద్మ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నమ్ముకున్నవారికి జనసేన పార్టీలో సముచిత స్థానం ఉంటుంది

- జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా నియమితులైన గంగులయ్యకు శుభాకాంక్షలు వెల్లువ
- గంగులయ్యను కలసి శుభాకాంక్షలు తెలిపిన అల్లూరి జిల్లా కార్యదర్శి సీతారాం బృందం

విశాలాంధ్ర-చింతపల్లి : జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇంచార్జ్, పాడేరు నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ఒంపూరు గంగులయ్య ను పాడేరులో ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, దుస్సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉల్లి సీతారాం మాట్లాడుతూ శ్రమించిన ప్రతి ఒక్కరికి జనసేన పార్టీలో సముచిత స్థానం ఉంటుంది అనడానికి గంగులయ్యకు జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా నియమించడమే ఉదాహరణ అన్నారు. కూటమి ప్రభుత్వంలో తెదేపా, బీజేపీ లతోపాటు జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ క్రమంలో పాడేరు నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న ఒంపూరు గంగులయ్యకు జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ పదవిని కల్పించి పార్టీలో సముచిత స్థానం ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా గంగులయ్యతోపాటు పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, దూనబోయిన రమణ, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిముదు కృష్ణమూర్తి (పండు), ఇతర నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే మన ముందున్న ప్రధాన లక్ష్యం

చినమేరంగి సిఐటివి తిరుపతిరావు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని చిన మేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి వి తిరుపతి రావు అన్నారు. బుధవారం పెద మేరంగి కూడలి వద్ద అయన ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో డ్రగ్స్ పూర్తిగా నిర్మూలించి డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొనున్నదని సిఐ తిరుపతిరావు తెలిపారు. దీనిపై ప్రజల్లో డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించేందుకు ప్రతి గ్రామ వార్డులలో ర్యాలీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగము రవాణా జరిగినట్లు తెలిసినట్లయితే వెంటనే మీ పరిధిలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిరోధక నినాదాలతో పెదమేరంగి కూడలి మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో చినమేరంగి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి అనీష్ చిన మేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సవరపు రమణ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పొంగుతున్న వాగులవద్ద పోలీస్ పహారా

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి,దీంతో అప్రత్తమైన రాజవొమ్మంగి ఎస్సై నరసింహ మూర్తి తమ సిబ్బందిని వాగులు వద్ద పహర పెట్టారు, వాగులకు ఇరువైపులా ఉన్న గ్రామస్తులు పొంగుతున్న వాగులు దాటేందుకు ప్రయత్నిస్తారని,వారిని నివారించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఆపేందుకు పోలీస్ పహారా పెట్టినట్లు ఆయన తెలిపారు,మండలంలో ఎర్రంపాడు, శాంతినగర్ వాగులు వద్ద పహారా పెట్టినట్లు తెలిపారు.

అన్నదాత సుఖీభవ ట్రాక్టర్ల ర్యాలీకి తరలివెళ్లిన నాయకులు

విశాలాంధ్ర-సీతానగరం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఇటీవల రైతులకు అన్నదాత సుఖీభవపథకం ద్వారా ఐదు వేలరూపాయలను, పిఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 2వేలరూపాయలు రైతుల ఖాతాలో నేరుగా జమచేయడంతో ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆదేశాలు, సూచనల మేరకు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ట్రాక్టర్లతో కలిసి ర్యాలీ కార్యక్రమానికి వెళ్లారు. నర్సిపురంనుండి పార్వతీపురంవరకు పెద్దఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సాల హరగోపాల్, దామినేని భాను ప్రసాద్,పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, జొన్నాడతేరేజమ్మ, కంకణాలపల్లి అరవింద్ కుమార్, తెంటు వెంకటఅప్పలనాయుడు, బుడితి శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు,కొట్నాణ రామకృష్ణనాయుడు, ఉడమల సూర్యనారాయణ, ఏగిరెడ్డిభాస్కరరావు, రెడ్డి సింహాచలం నాయుడు, సోమిరెడ్డి రమేష్,నాగభూషణరావు, వంజరాపుగుంప స్వామినాయుడు, శ్రీరాములు నాయుడు, మూడడ్ల వెంకట నాయుడు, వాకాడ పారినాయుడు, బలగ శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, గాజాపు శ్రీనివాసరావు, పరవాడ తిరుపతిరావు, బర్ల వెంకటరమణ, గొట్టాపు మంగమ్మఅప్పారావు, తెంటు రామారావు, మరడాన గౌరునాయుడు, తేలు శేఖర్, పెంట సురేష్, తేలు తిరుపతి, రెడ్డి అన్నంనాయుడు, బొన్నాడ సత్యనారాయణ, భోగి శంకరరావు, ఇజ్జాడ రాంబాబు, సబ్బాన జగన్నాథం, మర్రాపు శంకరరావు, కళ్యాణ బలరాం, నీరస జ్యోతి,రెడ్డి అన్నంనాయుడు, పెంట ఉమామహేశ్వర రావు, గవర భాస్కరరావు, యాళ్ల రామినాయుడు, శంకరరావు, కండ్యాన రవీంద్రనాయుడు, సూరిబాబు, బూరాడ చిరంజీవి, జక్కు ఫకీరునాయుడు, పెంట సురేష్, మర్రాపు సత్యనారాయణ, గుప్తా, యోగేశ్వరరావు, లక్ష్మణరావు, బోను శ్రీనివాసరావు మీసాల వెంకటరమణ, రాజేష్, కిషోర్, చిరంజీవి రాజు, జానీ, వాసు, శ్రీను, నాగరాజులు, సోమిరెడ్డి రమేష్, శ్రీరాములనాయుడు, సింహాచలం నాయుడు, మోహనరావు, రామకృష్ణ, పాల్గొన్నారు.